# అగ్రతాంబూలం

వేల్పూరు మొదటి నెంబరు జాతీయ రహదారికి మైలు దూరాన పడమటి దిక్కున ఇత్తడి బిందెలో ఉంచిన ప్రమిదలా కనిపిస్తుంది ఆ రహదారికి ఊరికి ఎడంగా విలసిల్లిన పోలమ్మ వారి గుడికి ఆనుకొని ఉందొక చింత చెట్టు. అడ్డూ ఆపూ లేకుండా, ఏపుగా పెరిగి ఏడుతరాలకు ఏకైక సాక్షిగా ఫాలాక్షుడి విశ్వరూపంలా ఆకాశంలోకి తొంగి చూస్తుంటుంది.

సందేవేళ వాలుతున్నప్పుడు అది రచ్చబండగా మారుతుంది. నిండు సభామండపంలా సందడి చేస్తుంది.

ఆపూట మధ్యాహ్నం ఏదో పనుండి అటువెళ్తూ భూమారెడ్డికి ఎండ పొడ తగిలి ఆలుపొచ్చిట్లనిపించి చింతచెట్టు చప్టాపైన కూర్చున్నాడు; నుదుట చోటు చేసుకున్న స్వేదబిందువుల్ని కండువాతో తుడుచుకుంటూ.

అప్పుడు... గుడితోవమ్మట నిటారుగా నడచి వెళ్తూన్న రామిరెడ్డి కనిపించి దిగ్గున లేచి గొంతు కనిచ్చాడు. ఎటో చూపు నిలిపి ఓసారి ఆగాడు కాని, యిటు తిరిగి చూడలేదు రామిరెడ్డి. ఇక లాభంలేదనుకొని సాగిపోతూన్న బామ్మర్దిని అందుకునేందుకు ఎదురెళ్ళాడు భూమారెడ్డి.

ఇటీవల కొన్ని రోజులుగా రామిరెడ్డి వాలకం అలాగే ఉంది. పామ్మనలేక పొగబెట్టినట్లుంది అతగాడి ధోరణి.

''ఏంవిటి బావా... పిలుస్తున్నా వినిపించుకోకుండా అలా విసవిసా వెళ్ళిపోతున్నావు?''

రామిరెడ్డి యిటు తిరక్కుండానే ''ఊ... చెప్పు'' అని ముక్తసరిగా బదులిచ్చాడు.

''పొరుగూరెళ్ళి మీ చిన్నబాబుని చూసొచ్చావుగా, ఏమన్నాడేమిటి?''

''హాఁ! ఏమంటాడు. మొండిచేయి చూపించి జారుకున్నాడు ముసలాడు. ఆరుకాదు... రెండు ఎరువు కట్టలు కూడా యివ్వలేనన్నాడు'' అని బదులిచ్చి కళ్ళు ఎగరేసి చూసి ''ఇంకేమైనా సంగతులున్నాయా?'' అని అడిగాడు అక్కణ్ణించి కదలడానికి సిద్ధమవుతూ. ఈసారి భూమారెడ్డికి అసహనం ముంచుకొచ్చింది.

''అదేంవిటి బావా... అలా వేడినీళ్ళు పోసుకున్నట్టు ఎగిరెగిరి వెళ్తున్నావు! కొంచెం ఆగి మాట్లాడకూడదా!''

''గాలోడలా ఎగిరిపోవడానికి మీ స్కూలు నేస్తం దశరథరెడ్డినా యేంవిటి?''

ఆ ఒక్కమాటనూ రెండువైపులా దూసుకెళ్ళే జంట తూటాల్లా విడిచిపెట్టాడని గ్రహించాడు భూమారెడ్డి. ఇప్పుడెక్కడో ఉన్న తన నేస్తాన్ని రొంపిలోకి లాగడం అతడికి యిబ్బంది కలిగించింది. అరకులోయంతటి ఆ అక్కసు వెనుక దాగివున్న కథాకమామిషూ అతడికి తెలియనిదా యేమిటి!

ఎప్పుడో మూణ్ణేళ్ళక్రితం జరిగిన దానిని బామ్మర్ది కావాలనే మనసున ముద్రవేసుక్కూర్చున్నాడు. అతిగా సాగదీస్తున్నాడు. స్వతహాగా రామిరెడ్డి ఆవేశపరుడూ... భోళామనిషి కూడాను. చిన్నచిన్నవాటిని అలవోకగా విసిరేయకుండా గుండె లోలోతుల్లోకి తీసుకుంటాడు. సతమతమవుతుంటాడు.

అప్పుడేమి జరిగిందంటే... తన రెండో కూతురు ధనలక్ష్మి పెద్దమనిషయినప్పుడు కార్యంలో కార్యంగా కోకకట్టడం తంతుకూడా జరిపించాలని తీర్మానించాడు. చెల్లెలు రుద్రమ్మ భర్తతోబాటు ఒకరోజు ముందుగానే వచ్చి యింట్లో బస చేసింది. ఉన్న ఊరినుంచేగాక పొరుగూళ్ళనుండి కూడా బంధుజనం వేంచేశారు.

తను ప్రత్యేకంగా కూతురి పేరంటానికి కళగట్టేలా నాదస్వర విద్వాంసుడు వినాయక మూర్తి సంగీత పార్టీని పిలిపిం చాడు. మామతరపు లాంఛనంగా రామిరెడ్డి మేనగోడలి కోసం బండెడు సామాను దించాడు. పట్నం నుంచి గద్వాల మంగలపట్టు చీర కట్టించాడు. చూసేవారి కళ్ళు అదిరిపోయేటట్లు అమ్మాయి మెడన రెండు తులాల బంగారు గొలుసువేశాడు.

అప్పుడే అనుకోని విధంగా ఆ ఉదంతం జరిగింది.

ముహూర్తం సమీపిస్తున్నా దశరథరెడ్డి జాడ కనిపించక పోయేసరికి తను రవ్వంత కలవరపాటుకి లోనయి పందిరి బయటకొచ్చి చూశాడు.

తనలా బయటకు రావడం దశరథరెడ్డి దంపతులు ఏతెంచడం ఒక్కసారే జరిగిపోయాయి. తను దంపతులిద్దరికీ ప్రత్యుత్థానం చేసి కూతురు కూర్చున్న మిద్దె వద్దకు తోడ్కొని వచ్చాడు.

అంతే ఆ తరవాత అంతా దేనికదే జరిగిపోయింది. ఇద్దరూ కూతురుపైన తలంబ్రాలు పోయడం, కట్నం చదివించడం... ధనలక్ష్మికి తొలి ఆశీర్వాదం యివ్వడం ఒకటి తరవాత ఒకటిగా కెమెరా షూటింగ్‌లా జరిగిపోయాయి.

తన దృష్టిలో అదంతా ఒక మామూలు పేరంటాల తంతులాగే కనిపించింది. కాని రామిరెడ్డికి అలా అనిపించలేదు. చెల్లెలు రుద్రమ్మకు కూడా అలా గోచరించలేదు.

అంతమంది దగ్గరి బంధువులుండగా, అగ్రతాంబూలం ఎక్కణ్ణించో వచ్చిన మూడో మనిషికి యివ్వజూపడమా!

అప్పట్నించీ ఆరంభమైంది తన పట్లా తన కుటుంబం పట్లా ఎడముఖమూ పెడముఖమూను. మనసు కిటికీ గుండా వాతావరణంలోని వేడిమిన స్పృశించిన భూమా రెడ్డి లౌకికంతో సంభాళించుకున్నాడు. ఎంతైనా చెల్లెలు మొగుడుకదా... సర్దుకుపోవాలి.

''సరే బావా! నువ్వేదో అర్జంటు పనిపైన వెళ్తున్నట్టున్నావు. తీరిగ్గా వచ్చి చూస్తాలే!''

''ఇంకెక్కడి అర్జంటు పని! చంద్రప్పడి తోడల్లుడు ఏవో ఎరువుల కట్టలు యిస్తానన్నాడట. రెండు కట్టలు సర్దగలడేమోనని అడుగుదామని. పొలంలోని వరినారు ముదురుకి వచ్చేసేటట్లుంది. మిరపతోటేమో ఎరుపుకి వచ్చేస్తూంది. రైతు కటకటలు సర్కారు వారెక్కడ గుర్తిస్తారు... ఇక నీ సంగతేమిటో చెప్పు''

''రేపు ఆగ్రో సెంటరు వాళ్ళు మెట్టవీధిలో తెరస్తా

## పాండ్రంకి సుబ్రమణి

## సాగరహాసం

ఎన్నెన్ని ఆశల పడవలు
గమ్య చేరకనే
నిరాశల లోతుల్లోకి మునిగిపోయాయో!
ఎన్నెన్ని భావాల ఆణిముత్యాలు
ఊపిరాడక ఉక్కిరిబిక్కిరై
బయటపడలేక
అడుగంటా జారిపోయాయో
ఆలోచనల సుడిగుండంలోపడి
తిరిగిరాలేనంటూ వీడ్కోలిచ్చి
ఎంత... 'కాలం' కలిసి కరిగిపోయిందో
మోస్తున్న జీవిత నావను
ఒడ్డుకు చేర్చే క్రమంలో
ఎన్నెన్ని కష్టాల తెడ్ల దెబ్బలు రుచి చూసిందో
ఘనీభవించిన సమస్యల బండలను
పిండిచెయ్యాలని ఎంత విఫలయత్నం చేసిందో
అయినాసరే!
నా ఆటుపోట్ల హృదయ కడలి
పట్టుదలను కోల్పోదు
ముందుకురికే కర్తవ్యాన్ని ససేమిరా మానుకోదు
అలుపెరుగని అలల సాయంతో
పెదాల తీరంవైపు
చిరునవ్వు నురుగును నెడుతూనే వుంటుంది

**ఇంద్రగంటి మధుసూదనరావు**

రట. ప్రొద్దుటే పట్టాదారు పాసుపుస్తకం పట్టుకెళ్దాం. ఏదో మంచి కబురే అందుతుందిలే!''

''ఎప్పుడని... ఎక్కడని. ఆకాశంలోని చుక్క మాయమవకముందే చాంతాడంత క్యూ కట్టాలి. మిట్టమధ్యాహ్నం ఎండల్లో మండిపోతూ నిల్చోవాలి. తీరా లైను దగ్గర కొచ్చేసరికి స్టాక్ అయిపోయిందంటారు. ప్రొద్దుట బిల్డింగుమందు ఇరవై టన్నుల ఎరువు దిగితే పెరటినుండి పదిటన్నులు లేచిపోతాయి. అడిగితేనేమో దొమ్మీ చేస్తున్నారని పోలీసుల్ని పిలిపించి లాఠీలు ఝుళిపిస్తారు''

బామ్మర్ది పడుతోన్న బాధలో తీక్షణత ఉండి. లోతు ఉంది. ఆ బాధలోని రొద అతనిదే కాదు... తనవంటి రైతులందరిదీను.

మధ్యాహ్నపుటెండ చురుకుమని లోచనల నుండి తీరుకుంటూ అతను తలపైకెత్తి మబ్బుల కదలికల్ని గమనిస్తూ తనకు తను చెప్పుకుంటున్నట్టు పైకి అనేశాడు.

''ఇటువంటి గడ్డు పరిస్థితుల్లో దశరథరెడ్డి ఉంటే బాగున్ను!'' అలాగనేసి చటుక్కున నాలిక కరచుకున్నాడు భూమారెడ్డి. చిన్నపాటి చినుక్కి కూడా లోతట్టు ప్రాంతం మునిగిపోతుందని తెలిసి కూడా అజాగ్రత్తగా పుట్టిని తగలబెట్టడం అంటే ఇదే!

అతడు జంకినట్లే జరిగింది.

రామిరెడ్డి రేగిపోయాడు.

''అతడుంటే మాత్రం యేం చేస్తాడట... ఆకాశం నుండి గంగను తీసుకొచ్చిన భగీరథుడిలా ఎరువుల మూటల్ని మోసుకొస్తాడా! ఆగ్రోసెంటర్ వాళ్ళ గోదాములను నింపేస్తాడా!'' భూమారెడ్డి ఇబ్బందిగా ముఖంపెట్టి చూశాడు.

''అబ్బే అదికాదు బావా! అప్పుడేమో ఒకసారి సమయానికి విత్తనాలు సరఫరాకాకపోతే జాయింట్ కలెక్టరుతో మాట్లాడి మనవాళ్ళందరికీ మేలురకం విత్తనాలు...''

''ఆగుబావా! ఆగు! పౌర్ణమినాటి విషయాన్ని అమావాస్యనాడు తలచుకుంటే ఎలా బావా! అప్పుడున్న ఆ జాయింట్ కలెక్టరేమో మీ నేస్తంతో కాలేజీలో కలసి చదువుకున్నాడట. ఆ దగ్గరితనంతో ఆ పని జరిపించుకొచ్చాడు. ఇప్పుడున్న పరిస్థితి అటువంటిది కాదు కదా! ఇక్కడే కాదు, పొరుగూళ్ళలో కూడా ఎరువుల కొరత

## మనిషి ఒంటరికాడు

ఒంటరితనమంటే శూన్యమే
తోడుంటేనే విలువపెరిగేది
జీవితం నిస్సారమైనప్పుడో
ఎవరిగూటికి వాళ్ళు చేరినప్పుడో
ఓటమి పలకరించినప్పుడో
మనం నిస్సహాయులమైనపుడో
ఒంటరితనం భయపెడుతుంది
నిస్సత్తువ వచ్చి చేరిపోతుంది
సున్నాగా మనం మిగిలిపోతాం
జీవితానికి ఫుల్‌స్టాప్‌పెట్టాలనిపిస్తుంది
నిర్వేదం ఆశ్రయించి
నిర్వీర్యత చోటు చేసుకుంటుంది
అప్పుడే తోడును వెతుక్కోవాలి
మంచి పుస్తకం అప్పుడైతే చాలు
గుండె లోతుల్లోకి చేరిన భావాలు
కంటి నుండి బాష్పాలౌతాయి
ఆలోచనా సులోచనాలను ధరింపజేసి
జీవితానికి కామాపెట్టించి
భవితపై ఆశలు రేపుతుంది
ఉద్వేగించి, ఉద్రేకించి, ఆలోచింపజేసి
చైతన్యీకరిస్తుంది
చిరిగిన చొక్కాయైనా తొడుక్కో
మంచి పుస్తకం కొనుక్కో
నిజమే, అక్షరం మనపాలిట దివ్యౌషధం
ప్రకృతీ అంతే
రకరకాలుగా మురిపించి, మైమరపించి
గుండెల్లో భావాల సెలయేళ్ళను ఒంపి
శూన్యానికి ముందు సంఖ్యాలా చేరి
శతమానంభవతి అని దీవించగలదా
అందుకే కృతి-ప్రకృతి మనిషికి నేస్తాలు
మనుగడకు రాస్తాలు
మనిషి ఎప్పుడూ ఒంటరికాడు
జయమో, అపజయమో
ధైర్యమో, స్థైర్యమో
ఊహాలో, ఊసులో తోడుంటాయి
జీవనగమనంతో పెనవేసుకుంటాయి

**విజయ**

## నా జీవన యానం

భవిష్యత్తుపై
నాకెన్ని మధురోహలో!
గతాన్ని ఆకళించుకొని
వర్తమానంలో ప్రణాళికలు రచించుకొని
ఆ గతంవైపు సాగిపోతున్న
అభ్యుదయ వాదిని నేను
నిన్నటి నిరాశల్ని పాతేసి
నేడెంత విలువైందో తెలుసుకొని
రేపటి ఆశాపథంలోకి
అడుగులేస్తున్న
బాటసారిని నేను
గడచిన పీడకలల్ని మరచిపోయి
నడుస్తున్న కాలానికి స్పందించి
వడివడిగా మునుముందుకు
పయనిస్తున్న
పాంథుణ్ణి నేను
కాలం
అది భూతమైనా
వర్తమానమైనా
భవిష్యమైనా
కాలమే
అది జీవితానికి సారమే
మనిషి మస్తిష్కంలో
అనుభవాలను భద్రపరుస్తుంది
గతం
మనిషి రక్తంలో
చైతన్యాన్ని పారిస్తుంది
వర్తమానం
మనిషి హృదయంలో
స్వప్నాలను రచిస్తుంది
భవిష్యం
స్వప్నాలను
వాస్తవాలుగా మార్చాలనే
నా యత్నం
మధురోహల్లో
తేలిపోతూ
బ్రతకాలనే
నా ఆశయం

**డా।। తిరునగరి**

భూతాకారంలా వ్యాపించింది. ప్రైవేటు మార్కెట్టులో కూడా దొరకడం గగనమయిపోయింది. ఇది గుర్తుంచుకోవాలి!''

అందుకే అంటారు... బోడిగుండంతటి నునుపు మౌనంగా ఊరుకున్నంత సుఖమూ లేదంటారు. నోరు జారి ఫైరింగ్ తెచ్చుకున్నాడతను. అయితే... ఉన్న దున్నట్లు చెపితే రామిరెడ్డి రయ్‌మని లేస్తాడేమోగాని అసలు దశరథ రెడ్డి తమతోబాటు వేల్పూరులో కాలం వెళ్ళదీయాల్సిన వ్యక్తికాదు.

సెంట్రల్ సర్వీసు పరీక్షల్లో సెల్కక్టయి ఆదాయపు పన్ను శాఖలో గెజిటెడ్ ఆఫీసరుగా ఓ వెలుగు వెలగవలసిన వాడు. ప్రమోషన్‌లపైన ప్రమోషన్‌లు అందుకొని ఆశల అంబరాన్ని అందుకోవలసినవాడు. కాని అనుకొన్నదొకటి జరిగింది మరోకటి అన్నట్టు దురదృష్టం మిత్రుడి బంగారు భవిష్యత్తుని పాములా కాటేసింది.

తల్లిదండ్రులిద్దరూ పొరుగూరి జాతరకు అడ్డతోవన వెళ్తున్నప్పుడు విషసర్పం ఒకటి తండ్రిని కాటేసింది. నురగలు కక్కుతూ ఆయన అక్కడే హరీ అని ప్రాణాలు వదిలాడు. ఏకాకిగా మిగిలిన తల్లికి, పెళ్ళికాని చెల్లికి తోడుగా వేల్పూరులోనే ఉండిపోవల్సి వచ్చింది. ఐతే ఏమి గనుక చలివేంద్రం వంటి తన నేస్తం ఉనికివల్ల ఊరికి మంచే జరిగింది.

ప్రాథమిక పాఠశాల ఉన్నత పాఠశాలగా ఎదిగింది. బడికి కొత్తకట్టడం లేచింది. మొదటిసారిగా స్కూలు క్లాసుల్లోకి కంప్యూటర్లు సర్వేర్లు ప్రవేశించాయి. దశరథరెడ్డి క్రియాశాలక పాత్రతో పూడిక తీయడాన చెరువుకి జలకళరావడమే కాదు, ముప్పై ఎకరాలు సాగుబడికి వచ్చాయి.

గ్రామసడక్ యోజన అమలుకాకముందే కొండ చిలువలాంటి తారురోడ్డు మార్కెట్ యార్డుకి దూసుకు వెళ్ళింది. పంటూ పండ్లనూ సమయానికి రైతులు మార్కెట్ యార్డుకి చేర్పించగలుగుతున్నారు. దళారుల బారినుండి తప్పించుకోగలుగుతున్నారు.

అలాగని... బామ్మర్ది కుటుంబం ఊరికి ఏమీ చేయలేదని చెప్పడం తన అభిమతంకాదు. సన్యాసులు బైరాగులు, కాళ్ళకు చెప్పుల్లేకుండా దూరప్రాంతాల నుండి తీర్థయాత్రలకని వచ్చే భక్తజనం తలదాచుకుంటూన్న ధర్మసత్రం రామిరెడ్డి పూర్వీకులు కట్టినదే!

గుడికి సంపూర్ణ కుంభాభిషేకం జరిపించి అమ్మవారి ఉగ్రరూప విగ్రహానికి వెండి తొడుగు చేయించి, పెళ్ళ పెళ్ళమని మెరిసే మాణిక్యంతో ముక్కుపుడక వేయించింది బామ్మర్ది తండ్రే. అయినా ఎందుకో మరి తన కళ్ళకు దశరథరెడ్డి ఒక్కడే చుక్కలమధ్య చంద్రుడిలా కనిపిస్తాడు. కష్టకాలమూ, గడ్డుకాలమూ వచ్చినప్పుడల్లా తన నేస్తమే జ్ఞాపకానికి వస్తాడు.

''అదేంటిటి... అలా ఒక్కసారిగా భారీ ఆలోచనలోకి వెళ్ళిపోయావు బావా!''

రామిరెడ్డి మాటలకు ఈలోకంలోకి వచ్చిపడ్డాడు భూమారెడ్డి. ''ఎలాగూ అడుగుతున్నావు కాబట్టి చెప్తున్నాను. మన మహేశ్వరిని వాళ్ళపెద్దబ్బాయి రాఘవకు అడిగాడు కదా! దశరథరెడ్డి అమెరికా నుంచి వస్తే ఏం చెప్పమంటావు!''

అదివిని రామిరెడ్డి నివ్వెరపాటుకి లోనయ్యాడు. ఎప్పుడో యథాలాపంగా లేవదీసిన ఆ మాటను ఈపాటికి బామ్మర్ది మరచిపోయుంటాడనుకున్నాడు. ఎంత నేస్తమయితే మాత్రం బంధుత్వాల బంధాలను విస్మరించడమా! ఇంట్లో చెట్టెంత కొడుకునుంచుకొని మేనకోడల్ని పరాయివాళ్ళ యింటికి కట్టివ్వమని సిఫారు చేయడమా!


రామిరెడ్డి అప్రయత్నంగా నిట్టూర్చాడు. ''అదా సంగతి! దానికిప్పుడేమి తొందరొచ్చిందిలే బావా!'' అంటూ ముందుకు కదిలాడు.

❖ ❖ ❖

దశరథరెడ్డి అమెరికా నుండి వచ్చీరావడంతో పాలేళ్ళు అందిచ్చిన చొగట్టా అందుకొని, కట్టిన బట్టలు కూడా విప్పకుండా చింతచెట్టు రచ్చబండకు చేరుకున్నాడు.

అతడు అక్కడకు వెళ్ళేటప్పటికి పెద్దపాటి కచేరీ జరుగుతోంది. మొన్న ఆగ్రోసంస్థ సెంటరు వద్ద సంభవించిన దొమ్మీ గురించి, పోలీసులు పాల్పడ్డ దౌర్జన్య చర్యల గురించి, ఆ దుర్ఘటన విషయమై ఎంక్వయరీ చేయడానికి ఆర్.డి.ఓ రాక గురించి తర్జన భర్జనపడుతున్నారందరూ.

ఎరువుల సప్లయి సెంటరు వద్ద చెలరేగిన ఆ దొమ్మీలో పోలీసు లాఠీదెబ్బలకు గాయాలపాలైన వాళ్ళలో ఎక్కువ మంది వేల్పూరు వాళ్ళే. అట్టుడికిపోతున్న ఆ పరిస్థితిలో కూడా ఆ గ్రామనియోజక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధి పరామర్శించడానికి రాకపోవడం రైతన్నల్ని ఆగ్రహోదగ్రుల్ని చేస్తుంది.



## దివ్యదీపావళి

నరకాసురుడను రక్కసి
నరులను హింసించుచుండె
జనులెల్లరు మొరపెట్టగ
పయనమాయె శ్రీహరి
ఘోరయుద్ధమే జరిగెను
నరకునికీ కృష్ణునికీ
శ్రీహరి బాణములనెల్ల
ఎదిరించెను రక్కసి
ఒక బాణము తగిలినంత
మూర్ఛిల్లెను మురారి
అది చూసిన సత్యభామ
ఉగ్రరూపిణాయెను
విల్లంబులు చేపట్టెను
దుష్టుని తునుమాడగను
ఆకర్ణాంతములాగి
ఒక్క శరము సంధించెను
ఆ బాణము ధాటికి
నరకుడు మరణించెను
దివినుండి దేవతలు
పూలవాన కురిపించెను
జనులందరి సంతసాలు
అంబరాలు తాకెను
నాటినుండి నేటివరకు
సంబరాలు సాగెను
అజ్ఞానపు తిమిరాలు
తొలగినంత వెలుగులు
ప్రతియింటను దివ్వెలు
దీపావళి జిలుగులు

బద్ది నాగేశ్వరరావు

అంతవరకూ ఎగిరెగిరిపడుతూ తోచిన వాళ్ళందర్నీ ఎడాపెడా బండబూతులు తిడ్తూ రంకెలు వేస్తూన్న మారప్పడు, సూరప్పడు, బాపిరెడ్డి ఉన్నపాటున ఆగిపోయారు. ఒక్కసారిగా గాలితీసేసిన తిత్తుల్లా అందరి ఆవేశాలనూ అదుపులోకి తేవడానికి ఆపసోపాలు పడుతూన్న భూమారెడ్డి అల్లంత దూరాన ఒదిగి నిల్చున్న దశరథరెడ్డిని ఆశ్చర్యంగా చూసి చేతులు చాచుతూ ఎదురెళ్ళాడు.

''ఎప్పుడొచ్చావు దశరథా!'' అంటూ మాటాపలుకూ లేకుండా చూస్తూ నిల్చున్న నేస్తాన్ని కుదుపుతూ- ''అమెరికా అంతా చూసొచ్చారా భార్యాభర్తలిద్దరూ! మెక్సికో కూడా వెళ్ళొస్తానన్నారు. అది కూడా చూసొచ్చారు కదూ!'' అని అడిగాడు.

''లేదు. అంతా తిరిగి చూడలేదు. మా అల్లుడికి చిన్నపాటి కారు యాక్సిడెంటు జరిగితే న్యూజెర్సీలోనే ఉండిపోవల్సి వచ్చింది. ఇప్పుడక్కణ్ణించే తిన్నగా వచ్చాం. అది సరేగాని, నేను విన్నదంతా నిజమేనా?''

భూమారెడ్డి పేలవంగా నవ్వి... ''ఇంకా అనుమానం దేనికి? ఎవడో ఎగస్త్రా పార్టీగాడు. ఎక్కణ్ణించో జవానులపై రాయిబెడ్డ విసిరాడు. అంతే... దొమ్మీ రేగిపోయింది. రాఠీ దెబ్బలతో చాలించలేదు. బెయిల్ దొరకని కేసులు పెట్టి జైలులో పెట్టారు. క్రిందామీదాపడి మొన్ననే బెయిల్ తెచ్చుకొని బయటపడ్డాం. అదీను అందరకూ బెయిల్ దొరకలేదు'' అని బదులిచ్చాడు.

''నేనడిగేది అరెస్టుల గురించి కాదు. ఈ దొమ్మీ వ్యవహారమంతా ఎరువుకట్టలకోసమేనానని'' అని మిత్రుడి చేతుల్ని అందుకున్నాడు దశరథరెడ్డి.

అప్పుడక్కడ నిల్చున్న రామిరెడ్డి స్పందించాడు. ''భలేవారయ్యాబాబూ! అసలీ రగలంతా ఎందుకంట? పంట పరువానికి ఎరువులు దొరక్కే కదా!''

దశరథరెడ్డి తిరిగి చూడలేదు. ''ఇంత జరుగుతున్నా నాకొకమాట చెప్పాలని తోచలేదు. నేనిచ్చి వెళ్ళిన మా అల్లుడి ఫోను నెంబరు జ్ఞాపకం రాలేదు అంతేనా?'' నేస్తం భుజాన్ని కుదుపుతూ అన్నాడతను.

''చెప్పావే అనుకో. కాని నువ్వేమో అంతదూరంలో ఉన్నావు. హాయిగా భార్యతో విహార యాత్ర చేస్తున్నప్పుడు నందిలా అడ్డుతగలడమెందుకని ఊరకున్నాను. అయినా నువ్వు మాత్రం యేం చేస్తావు చెప్పు. మా కష్టమేదో మేమే పడితే మేలని...''

''ఆగు భూమా! నువ్వు తప్పు చేశావు. ఎక్కడుంటే మాత్రం మీ కష్టాలు నావి కావా! రేపు నేను కలిసిపోయేది వేల్పూరి మట్టిలోనా లేక అమెరికాలోనా!''

నేస్తాలిద్దరి మాటలూ రామిరెడ్డికి మింగుడుపడటం లేదు. చప్పున ఓ పాత సినిమాలోని సీనోకటి కళ్ళముందు మెదిలింది. ఎవరో మతిమరపు డాక్టరు కావాలి పేషెంటు పరిస్థితి బాగాలేదని చెప్పీ చెప్పడంతో చెంగున లేచి పేషెంట్ యింటివేపు పరుగుతీశాడు.

## రాక్షస కోరిక

ఒక బాంబు పేలుద్దామంటే
అసమ్మతి వాదులు
ఆ ఛాన్సు ఇవ్వడంలేదు!
ఒక చిచ్చుబుడ్డి కాలుద్దామంటే
సురేకారం
కళ్ళల్లో నీళ్ళు కార్పిస్తోంది!
ఆశావాదం నిలువునా
మతాబు మతలబుగా మారినవేళ
దీనంగా తలదించుకుంటోంది!
మండిపోతున్న ధరల సమయంలో
మళ్ళీ మంటపెట్టడమెందుకని
భాగ్యనగరంలో డాబా ఎక్కేను!
చీకటిని చీల్చుకుంటూ
తారాజువ్వలు పరుగులు
అర్ధరాత్రి వెల్తురే వెల్తురు!
ఎవరన్నారు
ప్రజలు నిరుపేదలని
లక్షలు తగలేసే స్తోమతలు!
రేపు వుంటే తిందాం
లేకపోతే లేదు
అప్పుచేసి మరీ తగలెట్టేద్దాం!
ఎదురింటివాడు
ఏడ్చుకు చావాలి
వాడికళ్ళల్లో ఈర్ష్య చూడాలి!

జి.వి.యస్.ప్రియంవద

తీరా పేషెంట్ మంచంవద్దకు వెళ్ళి మెడికల్ కిట్ తెరిచిచూస్తే లోపలంతా ఖాళీ! ఆ లోపల పేషెంటు హరీ అంటాడు. అలా ఉంది వీళ్ళ వ్యవహారం! ఎరువుల కొరత తమ ఊళ్ళేనే కాదు రాష్ట్రమంతటినీ ఊపేస్తుంది. అన్నీ

అనుకున్నట్టు చేతికందితే ఈ ఆరాటాలు పోరాటాలు చేయడం ఎందుకని? అందుకే మరొకసారి కలుగ జేసుకున్నాడు.

"నువ్వు పనిగట్టుకొని వచ్చినంత మాత్రాన యిక్కడ సమస్య తీరిపోతుందాయేంవిటి! ఎరువులు అందు బాటులో ఉంటే... పంట పాడయిందని యిద్దరు సన్న కారు రైతులెందుకు ఉసురుతీసుకుంటారు. వసివాడి పోతున్న పంటల్ని చూడలేక ఇంకా కొందరెందుకు పొరుగూళ్ళకు వలసలు పోతారు"

అదివిని దశరథరెడ్డి గట్టిగా నిట్టూర్చాడు.

ఎట్టకేలకు రామిరెడ్డివైపు తిరిగాడు.

"అయ్యా రామయ్యా! నువ్వన్నది వాస్తవం. ఎంత కొట్టుమిట్టాడినా కొన్ని సమస్యలకు పరిష్కారం మన చేతుల్లో ఉండదు. ఆ మాటకు వస్తే బారెడంత ఖజానా ఉంచుకున్న ప్రభుత్వం సహితం చేష్టలుడిగి నిల్చుం టుంది. అయితే కొన్ని సందర్భాలలో ఏదో ఒక అదృష్ట శక్తి ఎక్కణ్ణించో వచ్చి పరిష్కార మార్గాన్ని మన చేతుల్లో పెట్టి వెళ్ళిపోవచ్చు. అటువంటిదే యిప్పుడు నా చేతుల్లో ఉండొచ్చుకదా!"

"అంటే... మీ జాయింట్ కలెక్టరు మిత్రుడు మళ్ళీ యిక్కడకు ట్రాన్సుఫరయి వచ్చేసేడాయేమిటి?" బాపిరెడ్డి అడిగాడు.

"లేదు. ఈ పరిస్థితిలో అతనుకూడా ఏమీ చేయ లేడేమో! కాని నాలుగునెల్ల క్రితం జరిగిందేమిటో చెప్తాను వినండి.

ఆనాడు నాకెదురైన ప్రతికూల పరిస్థితే నేడు నాకు - అంటే మనకు అనుకూలంగా మారిందన్నమాట. మా బంధువు ఒకాయనకు అవసరంగా కావాలంటే రెండు లక్షలు యిచ్చాను.

అప్పుడతను చేస్తున్నది ఎరువుల వ్యాపారం. చైనా మార్కెట్టు నుండి చౌకగా తెచ్చుకొని వ్యాపారం చేస్తు న్నాడు. అప్పుడు ఉన్నపాటున ఏమయిందంటే... అతడు భార్యతో సహా కొడుకులిద్దరూ ఉంటున్న ఆస్ట్రేలియా వెళ్ళిపోవల్సి వచ్చింది. అప్పుడు నేనెంతవద్దని మొత్తు కున్నా వినకుండా నాకు చేరాల్సిన క్యాష్‌కి బదులుగా అతడి గోదాములోని ఎరువుల స్టాక్ అంతా మా ఫాం హౌస్‌లోని గిడ్డంగిలో పెట్టి వెళ్ళిపోయాడు.

నేనిచ్చిందేమో రెండు లక్షలు, అతడిచ్చి వెళ్ళిన స్టాక్ విలువేమో... నాలుగు లక్షలు. ఆ స్టాక్‌ని డిస్పోజ్ చేయ డానికి ప్రయత్నాలు చేస్తున్నప్పుడు అమెరికాకు వెళ్ళాల్సి వచ్చింది. అంతే సంగతులు! ఇప్పుడైనా అర్థమైందా విషయం నాకు చెప్పకుండా ఉంచి ఎంత పెద్ద తప్పు చేశారో!"

అప్పుడు రిటైర్డ్ హెడ్మాష్టరు కాశీనాథరెడ్డి ముందు కొచ్చి జంకుతూ అడిగాడు... "చాలామందిమి ఉన్నాం. ఒక్కొక్కరికీ నాలుగు బస్తాల ఎరువులివ్వగలరా దశరథ రెడ్డిగారూ!

"నాలుగు కాదు. ఎనిమిదిస్తాను. చాలా?" అది విని అందరూ ఎగిరిపడ్డట్టయ్యారు. వాళ్ళు ఆశ్చర్యం నుండి తేరుకునే లోపల దశరథరెడ్డి తన ఫాంహౌస్ వేపు నడవ సాగాడు. అప్పుడు... మారప్పుడు చటుక్కున నిద్రలోంచి మేల్కొన్న వాడిలా పరుగున వెళ్ళి దశరథరెడ్డిని అందు కున్నాడు.

"అది సరే దశరథ రెడ్డిగారూ! ఏ ధరకిస్తారేంవిటి? మారికెట్ ధరకిస్తారా... చిలాక్ ధరకిస్తారా? అందరికీ యిత్తారా లేక..." అతడు దిగ్గున ఆగి వెనక్కి తిరిగి చూశాడు.

"భలేవాడివి మారప్పా! మనవాళ్ళందరూ పీకల్లోతు కష్టాల్లో ఉన్నప్పుడు ధరలగురించి బుర్రలు బద్దలుగొట్టు కుంటామా! ఆనాడు మా బంధువు నాకిచ్చి వెళ్ళిన ధరకే యిస్తాను. మనమందరమూ కష్టాల్లో ఉన్నాం. మనమంద రమూ మట్టిని నమ్ముకున్నవాళ్ళం. కాబట్టి మనమంద రమూ ఒక్కటే! ఒకరికిచ్చి మరొకరికి యివ్వనని ఎందు కనుకుంటున్నావు? నేనెప్పుడైనా మీవద్ద అలా ప్రవర్తిం చానా?"

మారప్పుడు "చమించండయ్యా!" అని తలవంచు కున్నాడు.

ఈసారి సూరప్పుడు రంగంలోకి దిగాడు... "ఇట్లా సెప్తున్నానని ఏమీ అనుకోబోకు సుమీ! మరేమో... పోలీ సోళ్ళకేసుల్లో పడి పైసలన్నీ కరుచయ్యి పోయాయయ్యా. అంతే కాదయ్యా... మాలో కొందరం నకిలీ ఎరువులు కొని మోసపోయి డబ్బంతా పోగొట్టుకున్నాం. ఇప్పు డేమో... మా ఆడాళ్ళ మెడలో తాళిబొట్టులు మాత్తరమే మిగిలాయి"

"ఇంతకూ నువ్వు చెప్పొచ్చేదేమిటి సూరప్పా!"

"డబ్బులు ఇప్పుడే..."

"అవసరం లేదు. పంటలు కాపుకొచ్చినప్పుడే యివ్వండి. సరేనా?" సూరప్పుడి భుజంపైన చేతినుంచి అన్నాడు.

భూమారెడ్డి ఈసారి ఊరుకోలేకపోయాడు. మిత్రుణ్ణి ప్రక్కకు పిలిచి... "ఇప్పుడప్పుడే బోలెడంత ఖర్చుచేసి వచ్చావు. అందులో అల్లుడిగారి వైద్యఖర్చులు కూడా తగిలినట్లున్నాయి... ఇప్పుడంతటి వెసులుబాటు యివ్వగలవా?" అన్నాడు.

దశరథరెడ్డి ఏమీ అనలేదు.

ఆకాశంలోకి దీర్ఘంగా చూసి నవ్వాడు.

అంతవరకూ ఎడం ఎండంగా నడుస్తూ వస్తూన్న రామిరెడ్డి కళ్ళముందు కదుల్తూన్న కొండ కనిపించింది. ఇప్పుడతనికి అంతా అర్థమైంది. బాగా అర్థమైంది! బావ మర్ది తన కన్నకొడుకు కోసం కాకుండా, అతడి కూతురు ఉమామహేశ్వరిని దశరథరెడ్డి కొడుకుకోసం పనిగట్టుకొని ఎందుకడుగుతున్నాడో!

## వయ్యారి భామ

అనుకోని అతిథిలా
పిలవని పేరంటంలా
ఈస్టిండియా కంపెనీలా
బహుళజాతి కంపెనీలలా
అమెరికా నుండి వచ్చి
మన పొలాలలో తిష్టవేసింది
వయ్యారాలొలకబోసే
అందమైన పిచ్చిమొక్క
పొమ్మన్నా పోను పోనంటుంది
పొలంలో కనపడిందా
రైతు గెండు దడ దడ
పంటలను పర్యావరణాన్ని
పాడుచేసే విషపుమొక్క పంటచేలను
అమాంతం
మింగివేసే కొండచిలువ
ఈయేడు ఒక్కటి
మరుసటేడుకు వేలకువేలు
ముట్టుకుంటే అంటుకుంటుంది
దగ్గు, దమ్ము, ఆయాసం
వల్లంతా ఒకటే దురద
వంటినిండా విషం
పేరుమాత్రం 'వయ్యారి భామ'
తస్మాత్ జాగ్రత్త.

**మేరెడ్డి యాదగిరిరెడ్డి**

అగ్రతాంబూలం అతడికి మాత్రమే ఎందుకిస్తు న్నాడో! అంతేకాదు... ఒక పదునైన సూర్యకిరణం వంటి భావం అతణ్ణి తాకివెళ్ళింది. దశరథరెడ్డిగాని ఊళ్ళో ఉండివుంటే... ఉసురు తీసుకున్న యిద్దరు సన్నకారు రైతులూ బ్రతికుండేవారేమో! ✻